క్లుప్తంగా

కంది పంట పరిశీలన



పొలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కదిరి అర్బన్: ముత్యాలచెరువులో ఇటీవల అడవికి ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పంటించగా.. సమీపంలోని రైతు చక్రినాయక్‌కు చెందిన కందిపంట కాలిపోయింది. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎంపీడీఓ పోలప్ప, ఏఓ శ్రీనివాసరెడ్డి మంగళవారం కంది పంటను పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు వారు తెలిపారు.

చిన్నారుల సమగ్రాభివృద్ధికి కృషి



శిక్షణలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లతో ఎంఈఓలు

ఎన్‌పీకుంట: చిన్నారుల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీ కార్యకర్తలు కృషి చేయాలని ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డి సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహిస్తున్న జ్ఞానజ్యోతి శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎంఈఓలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు రోజుల శిక్షణలో నేర్చుకున్న అంశాలను చిన్నారులకు చక్కగా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నరసమ్మ, మౌలాబీ, లక్ష్మీదేవి, డీఆర్‌పీలు చిన్నరెడ్డప్ప, మహేష్‌రెడ్డి, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'పీవీఎస్' విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

ముదిగుబ్బ: స్కూల్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ యాక్టివిటీస్ ఫెడరేషన్ ఇండియా ఆధ్వర్యంలో అనంతపురం పీటీసీ మైదానంలో ఈ నెల 20న నిర్వహించిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో అండర్-16, అండర్-14 బాలుర విభాగాల్లో ముదిగుబ్బలోని పీవీఎస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో చైర్మన్ పీవీ నాయుడు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఏడీ మనీషా, పీఈటీ జ్యోతియాదవ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పొదుపు అలవరచుకోవాలి

ఓడీచెరువు : మహిళలు నెలసరి బడ్జెట్ ప్లాన్ చేసుకొని పొదుపు చేయడం అలవరుచుకోవాలని ఏపీజీబీ ఫీల్డ్ ఆఫీసర్ శ్రీకాంత్ సూచించారు. ఆకుతోటపల్లిలో మహిళలకు ఆర్థిక అక్షరాస్యతపై ఏపీజీబీ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెలా ఆదాయం, వ్యయాలను రాసుకొని, ఖర్చులు తగ్గించుకొని భవిష్యత్తు కోసం పొదుపు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ విఠల్‌ప్రసాద్, ఆర్థిక అక్షరాస్యత కౌన్సెలర్ లక్ష్మన్న, ఏపీజీబీ బీసీ శ్రీదేవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

అలవెన్సుల అందజేత



దివ్యాంగ విద్యార్థి తల్లికి నగదు అందజేస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: భవిత కేంద్రంలోని దివ్యాంగ చిన్నారులకు మంగళవారం సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ఎస్కార్ట్, రవాణా, బాలికల హోమ్ బేస్డ్ అలవెన్స్‌లను అందజేశారు. కార్యక్రమానికి ఎంఈఓలు చెన్నక్రిష్ణ, ఓబుల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కొంతమంది చిన్నారుల అకౌంట్‌కు డబ్బులు జమయ్యాయని, అకౌంట్ లేని చిన్నారులకు నగదు అందజేశామని ఐఈఆర్‌టీ టీచర్ సౌజన్య తెలిపారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు అన్వేషతో పాటు పలువురు పాల్గొన్నారు.

సాగులో మెలకువలు పాటించాలి



రైతులకు సూచనలిస్తున్న ఏఓ లోకేశ్వరరెడ్డి

ఎన్‌పీకుంట: రైతులు పంటల సాగులో సాధారణ పద్ధతిలో కాకుండా శాస్త్రీయ పద్ధతిలో మెలకువలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయ శాఖ అధికారి లోకేశ్వరరెడ్డి తెలిపారు. ధనియానిచెరువు రైతు సేవ కేంద్రం పరిధిలోని వంకమద్ది గ్రామంలో మంగళవారం వ్యవసాయ, అనుబంధ శాఖల ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలను పరిశీలించి అందులో మెలకువలను రైతులకు సూచించారు.







బుక్కపట్నంలో బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ద్వాదశ జ్యోతిర్లింగాల నమూనాల్లో కొన్ని..

జ్యోతిర్లింగాల దర్శనం..
మురిసిన భక్తజనం

పుట్టపర్తి: మహాశివరాత్రిని పురస్కరించుకుని బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మంగళవారం బుక్కపట్నంలోని శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఓం శాంతి ప్రతినిధులు కల్పన, గోపీ ఆధ్వర్యంలో దేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలైన కేదారేశ్వరుడు, విశ్వనాథుడు, నాగేశ్వరుడు, భీమేశ్వరుడు, ఓంకారేశ్వరుడు, మహాకాళేశ్వరుడు, శ్రీశైలం మల్లన్న, రామేశ్వరుడు, వైద్యనాథుడు, త్రయంబకేశ్వరుడు, ఘృష్ణేశ్వరుడు తదితర ఆలయాల సెట్టింగులతో తీర్చిదిద్దారు. ఆలయాల ప్రాశస్త్యాన్ని.. శివరాత్రి ప్రాముఖ్యతను కళ్లకు కట్టినట్లు ప్రదర్శించారు. పూజారి హరిస్వామి, కల్పన గోపి, జయరామ్, సర్పంచ్ నాగలక్ష్మి, సామకోటి ఆదినారాయణ, పుర ప్రముఖులు క్షీరాభిశేకం నిర్వహించి పూజలు చేశారు. జ్యోతిర్లింగాలను దర్శించుకుని భక్తులు మురిసిపోయారు. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాదాలు అందించారు. ఈ ఉత్సవాలు మరో రెండురోజుల పాటు నిర్వహించనున్నారు.

ముస్తాబైన శైవక్షేత్రాలు
జాగరణ నేపథ్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు

తలుపుల/ ఓడీచెరువు : హిందువులు భక్తిశ్రద్ధలతో చేసుకునే మహాశివరాత్రి వేడుకలకు ఆలయాలు ముస్తాబయ్యాయి. పుట్టపర్తి, ధర్మవరం, కదిరి, రాప్తాడు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నారు. సకల పాపాలను హరించి దైవోన్ముఖం గావించే ఈ పండుగ నాడు ఉదయం నుంచి ఉపవాసం ఉండి రాత్రంతా శివనామస్మరణతో జాగరణ చేస్తే సకల శుభాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. బుధవారం రానున్న మహాశివరాత్రి పర్వదినం నాడు ఉదయం ప్రత్యేక పూజోత్సవాలు, రాత్రి శివపార్వతుల కల్యాణ మహోత్సవం, రాత్రి జాగరణ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అలాగే కోలాటం, చెక్కభజన, భక్తిపాటల కచేరీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించనున్నారు.

- తలుపుల మండలం ఓబీఆర్ రోడ్డు శివాలయం, ఓదులపల్లి సమీపాన సిద్ధేశ్వర ఆలయం, మండల సరిహద్దులో గల సిద్ధి లింగేశ్వర ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణాలు బుధవారం ఉదయం నుంచి శివన్నామ స్మరణతో ప్రతిధ్వనించనున్నాయి. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లూ చేశాయి. నామాలగుండు వద్ద గల సిద్ధి లింగేశ్వరుడు కోరిన కోర్కెలు తీర్చే దేవుడిగా విరాజిల్లుతున్నాడు. మండల ప్రజలతో పాటు పులివెందుల చుట్టుపక్కల గ్రామాల శివున్ని కొలుస్తారు. ఏటా మహాశివరాత్రికి తమ శక్తికొద్దీ అన్నదాన కార్యక్రమానికి బియ్యం, కందిబేడలు, విస్తరులు, గ్లాసులు, కూరగాయలు, తాము పండించిన వాటిని సైతం అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. శివరాత్రికి ఒక రోజు ముందే వివిధ తినుబండారాలతో పాటు, వివిద రకాల వస్తువుల అంగళ్ల ఏర్పాటయ్యాయి.
- ఓడీచెరువు మండల వ్యాప్తంగా శివాలయాల్లో మహాశివరాత్రిని పురస్కరించుకొని జాగరణకు ఏర్పాట్లు చేశారు. ఓడీసీలోని బస్టాండు కూడలిలో గల శివాలయం, మామిళ్ళకుంట్లపల్లి శివాలయం, ఎం.కొత్తపల్లి బండపై వెలసిన శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయ ప్రాంగణంలో ఇటీవల ఓ ముస్లిం భక్తుడు నిర్మించిన శివాలయం శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఆలయ ప్రాంగణంలో భజనలు, కోలాటం, చెక్కభజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



తలుపులలో నూతన అలంకరణతో, ఏర్పాట్లు చేసిన శివాలయం



తలుపుల ఓబీఆర్ రోడ్డులోని శివాలయం



పోట్లమర్రిలో విశేష పూజలందుకుంటున్న మల్లేశ్వరుడు

మహాశివరాత్రికి సర్వం సిద్ధం

బత్తలపల్లి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని వివిధ దేవాలయాలు, శివాలయాలను వేడుకలకు సిద్ధం చేశారు. సంగమేశ్వర క్షేత్రంతో పాటు సంజీవపురం సమీపంలోని కాటికోటేశ్వర క్షేత్రంలోనూ పోటు కుమారులు(సేవకులు) ఆధ్వర్యంలో బుధవారం శివరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. బత్తలపల్లిలోని శివాలయంలోనూ వేడుకలు నిర్వహించనున్నారు. పోట్లమర్రి, ముష్టూరు శివాలయాల్లో ఉత్సవ విగ్రహాలను ఊరేగించేందుకు ఏర్పాట్లు చేశారు. గంటాపురం అప్పస్వామి దేవాలయంలో వేడుకలకు సర్వం సిద్ధం చేసినట్లు అర్చకులు వివరించారు. రామాపురం వీరనారాయణస్వామి ఆలయంలో ఉత్సవ ఏర్పాట్లను సిద్ధం చేశారు. మాల్యవంతంలో వీరనారాయణస్వామి ఉత్సవాలను నిర్వహించేందుకు అన్ని సిద్ధం చేసినట్లు అర్చకులు తెలిపారు. గురువారం ఈ గ్రామాలలో జాతర నిర్వహించి భక్తులకు భవిష్యవాణి వినిపించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. బత్తలపల్లి, అప్పరాచెరువు, మాల్యవంతం గ్రామాలలో పౌరాణిక నాటికలు ప్రదర్శించనున్నారు. ఆయా ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేడుకలకు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ ప్రభాకర్, ఎస్‌ఐ సోమశేఖర్‌లు తెలిపారు.

రూ.1.72 లక్షల దుర్వినియోగం

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకం కింద 2023-34లో మండలంలో చేపట్టిన పనుల్లో రూ.1.72 లక్షలు దుర్వినియోగమైనట్లు తనిఖీ బృందం సభ్యులు నిగ్గుతేల్చారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక బహిరంగ సభ నిర్వహించారు. ప్రాజెక్ట్ డైరెక్టర్ విజయప్రసాద్, క్లస్టర్ ఏపీడీ చలపతి, అంబుడ్స్‌మెన్ అధికారి శివారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ నబీరసూల్, ఏపీఓ అనిల్‌కుమార్‌రెడ్డి, ఎస్‌ఆర్‌పీ చంద్రమోహన్ హాజరయ్యారు. పంచాయతీల వారీగా జరిగిన పనులు, వాటికి ఖర్చు చేసిన నిధులు, జరిగిన అవినీతి గురించి ఆడిట్ సభ్యులు చదివి వినిపించారు. 20 పంచాయతీల పరిధిలో దుర్వినియోగమైన రూ.1,72,676 సొమ్ము రికవరీకి పీడీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, తనిఖీ బృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సామాజిక తనిఖీ నివేదికలను పరిశీలిస్తున్న పీడీ విజయ ప్రసాద్

ఆట పాటలతోనే అర్థవంతమైన బోధన

గాండ్లపెంట: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో అర్థవంతమైన బోధన చేయాలని ఎంఈఓలు కృష్ణానాయక్, శ్రీనివాసులు పేర్కొన్నారు. జ్ఞానజ్యోతి శిక్షణలో భాగంగా స్థానిక ఉన్నత పాఠశాలలో ఆరు రోజుల పాటు అంగన్‌వాడీ కార్యకర్తలకు నిర్వహించిన శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. హెచ్‌ఎం సిద్దారెడ్డి, సీడీపీఓ జయంతి, రిసోర్స్ పర్సన్‌లు షబ్బీర్‌బాషా, సునిల్ కరుణాకర్, ఎస్‌ఎస్ నాయుడు, పద్మావతి అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఎలా బోధించాలో మెలకువలు నేర్పించారు. కార్యక్రమంలో సీఆర్పీలు, ఎంఈఓ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ కృష్ణానాయక్

చిన్నారులకు ఆటపాటలతో బోధించండి

చెన్నేకొత్తపల్లి: చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యనందించాలని ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్‌నాయుడు అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. స్థానిక మోడల్ స్కూల్ లో అంగన్‌వాడీ సిబ్బందికి ఆరు రోజులపాటు జరిగిన జ్ఞానజ్యోతి శిక్షణ మంగళవారం ముగిసింది. రిసోర్స్‌పర్సన్లు జయరామిరెడ్డి, మంజునాథ్, చంద్రశేఖర్ పలు అంశాలపై అవగాహన కల్పించారు.

మహాధర్నా విజయవంతం చేయండి

పుట్టపర్తిటౌన్: పేదల ఇంటి పట్టాల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా మార్చి మూడో తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం పుట్టపర్తిలోని సీపీఐ కార్యాలయంలో మహాధర్నా కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వేమయ్యయాదవ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు అవుతున్నా నిరుపేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేసే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు అర్హులందరికీ ఇంటి పట్టాలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు వాటి ఊసే ఎత్తడం లేదని, సర్వేల పేరుతో కాలయాపన చేస్తున్నారని మండి పడ్డారు. మహాధర్నాకు సీపీఐ, ప్రజా సంఘాల నాయకులు, నిరుపేదలు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఆంజనేయులు, పట్టణ కార్యదర్శి వినోద్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

పట్టాలిచ్చే వరకూ పోరాటం

తాడిమర్రి: పేదలకు ఇళ్ల, పట్టాల మంజూరులో కూటమి సర్కారు మీనమేషాలు లెక్కిస్తోందని సీపీఐ ధర్మవరం నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు ఎద్దేవా చేశారు. మండలంలోని ఎం.అగ్రహారం లో మంగళవారం ఆయన సీపీఐ, రైతు సంఘం, వ్యవసాయ కార్మికుల సంఘం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన పేదలకు గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పు మంజూరు చేసేవరకు పోరాటాలు చేస్తూనే ఉంటామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు బీసాని లక్ష్మీనారాయణ, దాసు, చిన్న పెద్దన్న, రాముడు, చౌడప్ప పాల్గొన్నారు.



పుట్టపర్తిలో కరపత్రాలు విడుదల చేస్తున్న నేతలు

పీ4 సర్వే సమర్థవంతంగా చేపట్టాలి

బత్తలపల్లి: ప్రగతి పథంలో నడిపించి, అందరి జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో చేపట్టిన పీపుల్ సర్వే- 4ను సమర్థవంతంగా నిర్వహించాలని ఏపీఎస్‌డీపీఎస్ విజయవాడ నుంచి వచ్చిన కన్సల్టెంట్ శ్రీమంత్‌సాయి సూచించారు. మంగళవారం పోట్లమర్రి గ్రామంలో జరుగుతున్న పీ4 సర్వేను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్వే అధికారులు చేపట్టిన సర్వేను గృహ యజమానులను ప్రశ్నించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యంతో ప్రతి ఇల్లూ పేదరికాన్ని అధిగమించి ఆర్థికంగా, సామాజికంగా బలోపేతం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ విధానాన్ని అమలు చేస్తోందన్నారు. ఆయన వెంట డీవైఎస్‌ఓ గోపాల్, ఏఎస్‌ఓ డాక్టర్ లక్ష్మీనరసింహశర్మ, వీఆర్‌ఓ రాణా ప్రతాప్, సాయి, కార్యదర్శి నారాయణస్వామి, అశోక్, వేల్ఫేర్ అసిస్టెంట్ మంజునాథ్, విఆర్‌ఏ నరసింహులు తదితరులు ఉన్నారు.

నల్లచెరువు: మండలంలో సచివాలయ సిబ్బంది చేస్తున్న పీ4 సర్వేని ఎంపీడీఓ రఘునాథ గుప్తా మంగళవారం పరిశీలించారు. నిర్ణీత సమయంలో సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, పంచాయితీ కార్యదర్శులు గంగాధర, కిషోర్‌బాబు , డీఏ అజయ్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోట్లమర్రిలో సర్వే వివరాలను పర్యవేక్షిస్తున్న శ్రీమంత్‌సాయి, తదితరులు

పారిశుధ్య కార్మికుల జీతాలకు వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయికులు

ధర్మవరం: మున్సిపాలిటీలోని పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న కరోనా, అదనపు కార్మికులకు నెలవారీ జీతాలు ఇవ్వాలని మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు బాబు, కార్యదర్శి ముకుంద, కోశాధికారి లక్ష్మి ఓబులేసు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం కమిషనర్ ప్రమోద్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కరోనా సమయంలో తక్కువ వేతనంతో పని చేస్తున్న 87 మంది కార్మికులకు డైలీ వేజ్ కింద రూ.15వేలు తగ్గకుండా ప్రతి నెలా జీతాలు చెల్లించేలా చూడాలని విన్నవించారు.

'పది'లో ఉత్తీర్ణత శాతం పెంచాలి



మాట్లాడుతున్న ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు

చెన్నేకొత్తపల్లి: పదో తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ-2 ప్రసూన్‌కుమార్‌నాయుడు సూచించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ప్రత్యేక శిక్షణ తరగతులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇక్కడ ఎంత మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాస్తున్నారని ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుజాతను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఏవిధంగా తరగతులను నిర్వహిస్తున్నారని ఆరా తీశారు. ప్రత్యేక తరగతులతో పాటు పరీక్ష నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు.

నాటుసారా తయారు చేస్తే కఠిన చర్యలు

చెన్నేకొత్తపల్లి: నాటుసారా తయారు చేసే వారిని కఠినంగా శిక్షిస్తామని చెన్నేకొత్తపల్లి ఎక్సైజ్ సీఐ ఫరూక్ ఆజాం ప్రజలకు హెచ్చరించారు. గంగినేపల్లి ఎగువ, దిగువ తాండాల్లో మంగళవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం కార్యక్రమాన్ని తెలియజేశారు. నాటుసారా తయారీ, విక్రయం నిషేధమన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తాండాల్లో ఎవరైనా నాటుసారా తయారు చేసినా, విక్రయించినా తమకు సమాచారం అందించాలని సూచించారు. ఎక్సైజ్ ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి ఆస్పత్రికి

ధర్మవరం అర్బన్: పట్టణంలో మతిస్థిమితం లేకుండా తిరుగుతున్న ఒడిశాకు చెందిన శివరాంసింగ్‌ను మంగళవారం ఆస్పత్రికి తరలించారు. వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్ చొరవ తీసుకుని కడపలోని మనో బంధు ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులతో మాట్లాడి శివరాంసింగ్‌ను కడప ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ ఆస్పత్రికి పంపించారు.



మతిస్థిమితంలేని వ్యక్తిని అప్పగిస్తున్న సీఐ నాగేంద్రప్రసాద్

నేడు కోన కణ్వాశ్రమంలో మహాశివరాత్రి ఉత్సవాలు



పూజలందుకున్న మల్లేశ్వరస్వామి

చెన్నేకొత్తపల్లి: కోన కణ్వాశ్రమంలో మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం గోపూజ, ధ్వజారోహణం, 8 నుంచి 10 గంటల వరకూ కోన మల్లేశ్వరస్వామి వారికి మహా రుద్రాభిషేకం, భక్తులతో స్వామికి జలాభిషేకం నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 4 నుంచి రాత్రి 10 గంటల వరకు కళాకారులతో చెక్కభజన, భజన జరుగుతాయన్నారు. రాత్రి 10 నుంచి 12 వరకు ఆధ్యాత్మికోపన్యాసాలు, అర్ధరాత్రి శివపార్వతుల కల్యాణోత్సవం ఉంటుందని వివరించారు. గురువారం భక్తులకు అన్నదానం చేపడతామని తెలిపారు.

వ్యాసరచన పోటీలు

కదిరి అర్బన్: జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యతపై అంగన్‌వాడీ టీచర్లకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారులు చెన్నకృష్ణ, ఓబుల్‌రెడ్డి, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

అబాకస్ పోటీల్లో ప్రతిభ



బహుమతులు సాధించిన విద్యార్థులతో పాఠశాల యాజమాన్యం

బత్తలపల్లి: ఏఐఆర్‌ఏ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ నిర్వహించిన అబాకస్ ప్రతిభా పరీక్షల్లో బత్తలపల్లికి చెందిన విజ్ఞాన భారతి విద్యాలయం విద్యార్థులు సత్తా చాటినట్లు పాఠశాల చైర్మన్ వెంకటక్రిష్ణ, కరస్పాండెంట్ కవిత, ప్రధానోపాధ్యాయురాలు మాధవి, అబాకస్ టీచర్ హేమలత పేర్కొన్నారు. మంగళవారం వారు బత్తలపల్లిలోని విద్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు మంచి ప్రతిభను చాటినట్లు వివరించారు. వారిలో తృతీయ స్థానంలో 5వ తరగతి విద్యార్థిని అశ్విత, ఆరవ స్థానంలో 3వ తరగతి విద్యార్థి సాత్విక్ నిలిచినట్లు వివరించారు. అదేవిధంగా 28 మంది విద్యార్థులు అబాకస్ అచీవర్స్ అవార్డులు పొందారన్నారు. విద్యార్థులందరికీ పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు.

అవకతవకలకు పాల్పడొద్దు



మాట్లాడుతున్న ఆర్డీఓ వీవీఎస్ శర్మ

కదిరి అర్బన్: ప్రజాపంపిణీ వ్యవస్థలో అవకతవకలకు పాల్పడితే డీలర్లపై చర్యలు తప్పవని ఆర్డీఓ వీవీఎస్ శర్మ హెచ్చరించారు. మంగళవారం మున్సిపల్‌పరిధిలోని కుటాగుళ్ల సమీపంలో ఉన్న స్టాక్ పాయింట్‌లో ఆయన జిల్లా పౌరసరఫరాల శాఖ డీఎం అశ్వత్థనాయక్‌తో కలిసి కదిరి, తలుపుల మండలాల రేషన్ డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లు ఇంటివద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలన్నారు. నిర్దేశిత సమయంలోగా ఈ-కేవైసీని పూర్తి చేయాలని చెప్పారు. ఈ-కేవైసీ చేయడానికి ఇదివరకే డీలర్లకు జాబితా పంపామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయండి

గాండ్లపెంట: మండల కేంద్రం గాండ్లపెంటలోని పౌరసరఫరాల గిడ్డంగిలో మంగళవారం గాండ్లపెంట, ఎన్‌పీ కుంట మండలాల డీలర్లు, ఎండీయూ వాహన సిబ్బందితో ఆర్డీఓ శర్మ సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నిత్యావసర సరుకులను ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేయాలన్నారు. ఈ నెల 28లోగా ఈ-కేవైసీ పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్లు బాబురావు, దేవేంద్ర, సీఎస్‌డీటీ వాణీబాయి, ఆర్‌ఐ అశోక్, గిడ్డంగి ఇన్‌చార్జ్ వెంకటేష్ పాల్గొన్నారు.